క్లుప్తంగా

నగర ప్రజలకు కమిషనర్ దీపావళి శుభాకాంక్షలు



దిలీప్‌కుమార్

నిజామాబాద్ సిటీ: దీపావళి పండుగ సందర్భంగా ఇందూరు వాసులకు మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ శుభాకాంక్షలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పండుగ అందరి జీవితాల్లో ఆనందాలు తీసుకురావాలని, వారి కుటుంబాల్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. టపాసులు కాల్చేవారు సురక్షిత విధానాలు పాటించాలని సూచించారు. ప్రమాదాలు జరగకుండా తల్లిదండ్రులు పిల్లలను దగ్గరుండి పటాకులు కాల్చేలా చూడాలని తెలిపారు.

రూ. 60 లక్షల నిధులు మంజూరు



సిరికొండ: ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయిన కొండూర్ కప్పల వాగు వద్ద రోడ్డు నిర్మాణానికి రూ. 60 లక్షల నిధులు మంజూరయ్యాయని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాకారం రవి తెలిపారు. మండల కేంద్రంలో వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి నిధులు మంజూరు చేయించారని తెలిపారు. చీమన్‌పల్లి గుడిపేట నుంచి తాటిపల్లి వెళ్లే దారిలో శాంతినగర్ వరకు రెండు కిలో మీటర్ల మేర రెండు వరుసల తారు రోడ్డు నిర్మాణానికి రూ. 2 కోట్లు నిధులు మంజూరైనట్లు తెలిపారు. డీసీసీ కార్యదర్శి ఎర్రన్న, దేగాం సాయన్న, చల్ల రాజారెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నర్సింగ్, మండల ఉపాధ్యక్షుడు మల్లేష్‌యాదవ్, డీలర్ రమేష్, ఆకునూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం



నిజామాబాద్ రూరల్: నగరంలోని శంభులింగేశ్వరాలయం, నీలకంఠేశ్వరాలయం, భక్త మార్కండేయ మందిరాల్లో ఆదివారం మాస శివరాత్రి ని పురస్కరించుకుని శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. శంభుని గుడిలో ఉదయం ప్రత్యేక పూజలు అభిషేకం నిర్వహించారు. ఏలేటి పశుపతి శర్మ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి రాములు, చైర్మన్ బింగి మధు, ధర్మకర్తలు కమల్ కిషోర్, మామిడి శేఖర్, రమేష్, రాము, గాండ్ల సంతోష్ కుమార్, గాజుల కిషోర్, గోపురేఖ, అర్చక సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

ఇసుక లారీ స్వాధీనం

మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల మండలం తాళ్ల రాంపూర్ శివారు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్వర్ ఆదివారం తెలిపారు. మెండోరా మండలం పోచంపాడ్‌కు చెందిన కాంట్లె రాజు, కమ్మర్‌పల్లికి చెందిన బోదాసు రాజు లారీలో ఇసుకను నింపుకుని ఏర్గట్లవైపు వస్తుండగా లారీని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసుకున్నామన్నారు.

ముదక్‌పల్లిలో టిప్పర్..

మోపాల్: మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముదక్‌పల్లి గ్రామ శివారు నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై సుస్మిత ఆదివారం తెలిపారు. డ్రైవర్ మహేష్ సరైన అనుమతులు చూపకపోవడంతో టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	1,35,600	వెండి(కిలో)	1,88,000
22 క్యారెట్స్	1,24,967		- నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	120
స్కిన్‌లెస్	180	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	24	గాజరుగడ్డ	40	80
బెండకాయ	40	80	పచ్చిమిర్చి	40	80
బీరకాయ	50	100	దోసకాయ	30	60
దొండకాయ	50	100	ఆలుగడ్డ	30	60
బీర్నిసుకాయ	60	120	గోబిగడ్డ	20	40
కాకరకాయ	30	60	గోబిపువ్వు	40	80
వంకాయ	40	80	బీట్‌రూట్	40	80
పాలకూర	50	100	కరివేపాకు	40	80
మెంతికూర	80	160	చామగడ్డ	30	60
కొత్తిమీర	50	100	చిక్కుడుకాయ	40	80
పుదీనా	60	120	గోరుచిక్కుడు	50	100
క్యాప్సికం	50	100			

-సుభాష్‌నగర్

వంతెనలకు మోక్షమెప్పుడో..?

- వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్న సిర్నాపల్లివాసులు
- ఏళ్ల తరబడి కష్టాలు పడుతున్న వైనం
- సమస్యలను పట్టించుకోని ప్రజాప్రతినిధులు



సిర్నాపల్లి శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో ఉన్న వాగు



సిర్నాపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన మార్గంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు (ఫైల్)

ఇందల్వాయి: అవసరమైన చోట్ల వంతెనల నిర్మాణాలు జరగక సిర్నాపల్లి గ్రామస్తులు ఏళ్ల తరబడి అనేక బాధలు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు గ్రామానికి ఇరువైపులా ఉన్న వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రజలు ఎటూ వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మారిన ప్రతిసారి వంతెనలు నిర్మించాలని గ్రామస్తులు విన్నపాలు చేసుకుంటూ ఎన్ని దరఖాస్తులు చేసుకున్నా పట్టించుకున్న ప్రజాప్రతినిధే లేడని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అంత్యక్రియలు, అత్యవసర పనులకు ఆటంకం..

గ్రామంలోని శ్మశానవాటికకు వెళ్లాలంటే బుగ్గవాగు దాటి వెళ్లాల్సిందే. ఈ సారి కురిసిన భారీ వర్షాలకు వారాల తరబడి వాగు ఉధృతంగా ప్రవహించడంతో అంత్యక్రియలు నిర్వహించడానికి ఇబ్బందులు పడ్డామని, ట్రాక్టర్ల సాయంతో మృతదేహాలను, బంధువులను వాగు దాటించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇదే కాకుండా గ్రామానికి ఉన్న ప్రధాన రోడ్డు మార్గంలో ఉన్న వాగుపై ఉన్న లోలెవెల్ వంతెన పైనుంచి ఈసారి ఉధృతంగా వరద ప్రవహించడంతో అత్యవసర పనులతో పాటు వైద్య సేవలకు ఆటంకం వాటిల్లినట్లు గ్రామస్తులు తెలిపారు. వంతెనలు లేక గ్రామస్తులు ఇంతలా ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని, ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే వచ్చి వంతెనలు కట్టిస్తామని చెప్పి గెలిచిన తర్వాత ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో విఫలమవుతున్నారని సిర్నాపల్లి గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

వంతెనల అవసరం గుర్తించాలి



సిర్నాపల్లి గ్రామంలో ఎల్లమ్మ ఆలయం వద్ద, బుగ్గవాగుపై వంతెనల నిర్మాణం ఎంత అవసరమో అధికార ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు గుర్తించాలి. ఏళ్ల తరబడి సమస్య పరిష్కారం కోసం ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేదు. వాగులు ఉధృతంగా ప్రవహించినప్పుడు ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి గ్రామస్తుల కోరిక మేరకు వంతెనలను నిర్మించాలి.

– సందీప్ గౌడ్, సిర్నాపల్లి

కానిస్టేబుల్ ప్రమోద్‌కు కొవ్వొత్తులతో నివాళి



పూలాంగ్ వద్ద నివాళులు అర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘం నాయకులు



అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు



నగరంలో మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు



సిరికొండలో మాట్లాడుతున్న నక్క రాజేశ్వర్

నిజామాబాద్ నాగారం: పాత నేరస్తుడి దాడిలో శుక్రవారం మరణించిన కానిస్టేబుల్ ప్రమోద్‌కు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘం నాయకులు ఆదివారం రాత్రి నగరంలోని పూలాంగు చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు ఈ సందర్భంగా మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గైని గంగారం, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ మాట్లాడారు. కానిస్టేబుల్ ప్రమోద్ ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యం ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సక్కివిజయ్‌కుమార్, కరిపే రవీందర్, కొయ్యాడ శంకర్, తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని స్థానిక ఎల్లమ్మ గుట్టలోని సాయిధ పోరాట అమర వీరుల స్తూపం వద్ద బీసీ సంక్షేమ సంఘం నాయకులు నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ మాట్లాడారు.ఈ కార్యక్రమంలో బుస్సా ఆంజనేయులు, కరిపే రవీందర్, కొయ్యాడ శంకర్, మాడవేడి వినోద్, బగ్గలి అజయ్, శ్రీలత, విజయ్, చంద్రకాంత్, బసవసాయి, చంద్రమోహన్, నరసయ్య వాసంజయ, ఓంకార్, మురళి కైరం కొండ బాబు తదితరులు పాల్గొన్నారు

రియాజ్‌ని వెంటనే ఉరి తీయాలి

ఖలీల్ వాడి: సీసీఎస్ కానిస్టేబుల్ ప్రమోద్ హత్య చేసిన రియాజ్ ను వెంటనే ఉరి తీయాలని ఇందూరు విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్ అన్నారు. నగరంలోని ఏబీవీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని ఇలాంటి ఘటనలు జరగకుండా కఠినమైన చట్టాలను తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందూర్ జిల్లా కన్వీనర్ బాలకృష్ణ, కంఠేశ్వర్ జోనల్ ఇంచార్జ్ దుర్గాదాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోపి, కార్తీక్, చంద్ర, అఖిలేష్, బాలకృష్ణ, శ్రేయస్, మణికంఠ, రాజేష్, టోనీ, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

తెయూ(డిచ్‌పల్లి): కానిస్టేబుల్ ప్రమోద్‌ను హత్య చేసిన నిందితుడు రియాజ్‌ని నడిరోడ్డుపై వెంటనే ఉరితీయాలని తెలంగాణ యూనివర్సిటీ ఏబీవీపీ అధ్యక్షులు పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. తెయూలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి సమీర్, వైస్ ప్రెసిడెంట్ మనోజ్, జాయింట్ సెక్రటరీ అనీల్, శివ, అనిల్, దిగంబర్ ప్రేమ పాల్గొన్నారు.

సంతాపం తెలిపిన సీపీఐ

నిజామాబాద్ సిటీ: విధి నిర్వహణలో పోలీసు కానిస్టేబుల్ ప్రమోద్ దుండగుడి చేతిలో హతమవ్వడంపై సీపీఐ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడారు. సమావేశంలో నాయకులు ఓమయ్య, హనుమాన్లు, గంగాధర్ పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

సిరికొండ: కానిస్టేబుల్ ప్రమోద్‌ను హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నక్క రాజేశ్వర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో వారు ఆదివారం మాట్లాడుతు కానిస్టేబుల్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు ప్రభాకర్, బీజేవైయం మండలాధ్యక్షుడు పోతుగంటి మధు, తలకట్ల గంగారెడ్డి, కనగందుల గోపి, బచ్చు మారుతి, వావిలాల అజయ్, కామాని కిరణ్, ఒడ్డెన్న, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



నగరంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు



తెయూలో మాట్లాడుతున్న పృథ్వీరాజ్

ప్రభుత్వాలు జవాబుదారీగా ఉండాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్

నిజామాబాద్ నాగారం: రాజ్యాంగం కల్పించిన హక్కులకు ప్రభుత్వాలు జవాబుదారీగా ఉండి అమలు చేయాల్సిన నైతికత ఉందని సీఎల్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో పౌరహక్కుల సంఘం(సీఎల్‌సీ) ఉమ్మడి జిల్లా 17వ మహాసభ జరిగింది. ఆయన మాట్లాడుతూ.. పౌర హక్కుల సంఘం ఐదు దశాబ్దాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనూ బలమైన పౌర హక్కుల ఉద్యమాన్ని నిర్మిస్తూ ముందుకు సాగుతోందన్నారు. సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న ఉద్యమం, తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొంటూనే ప్రజలతో కలిసి హక్కుల ఉద్యమాన్ని నిర్మిస్తోందన్నారు. కశ్మీర్ మొదలు కన్యాకుమారి వరకు, మణిపూర్ నుంచి గుజరాత్ వరకు అన్ని ప్రాంతాల్లోని హక్కులని, మారణ హోమానికి వ్యతిరేకంగా కార్యాచరణ కొనసాగిస్తోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నారాయణరావు, పౌర హక్కుల సంఘం జిల్లా నాయకులు జలంధర్, బీక్ సింగ్, భాస్కరస్వామి, విజయరామరాజు, ప్రవీణ్, సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ, సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ నాయకులు వెంకన్న, గంగాధర్, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు నర్రా రామారావు, టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ బంద్‌కు సహకరించిన అందరికి ధన్యవాదాలు



నిజామాబాద్‌నాగారం: బంద్ ఫర్ జస్టిస్ పేరుతో చేపట్టిన రాష్ట్రవ్యాప్త బంద్ జిల్లాలో విజయవంతమైందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ అన్నారు. బంద్‌కు సహకరించిన అందరికి ధన్యవాదాలు తెలిపారు. నగరంలోని కేర్ డిగ్రీ కాలేజీలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించేవరకు పోరాడుతామని రాష్ట్ర ఉపాధ్యక్షులు బుస్స ఆంజనేయులు అన్నారు. కరిపె రవీందర్, కొయ్యాడ శంకర్, మాడవేడి వినోద్, బగ్గలి అజయ్, శ్రీలత, విజయ్, చంద్రకాంత్, బసవసాయి, చంద్రమోహన్, నరసయ్య, ఓంకార్, మురళి కైరం కొండ బాబు తదితరులున్నారు.

అక్రమంగా ఇసుకదందా..!



ఆకుల కొండూరు గ్రామంలో ఇసుక తవ్వడంతో ఏర్పడిన గోతులు

నిజామాబాద్ రూరల్: రూరల్ మండలంలోని ఆకుల కొండూర్‌లో అక్రమంగా ఇసుక దందా జోరుగా సాగుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఓ రైతు తన వ్యవసాయం పొలం నుంచి ఇసుక తవ్వకాలను ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టి ఇసుకను విక్రయించడంపై ఆరోపణలు వస్తున్నాయి. అక్రమ ఇసుక తరలింపుతో భూగర్భ జలాలు అడుగంటిపోయే పరిస్థితి ఉందని ఆప్రాంత రైతులు వాపోతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఆకుల కొండూరు గ్రామంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం లేదు. ఇసుక తీయడానికి ఎవరికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. సొంత వ్యవసాయ భూమి నుంచి అక్రమంగా ఇసుక, మొరం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

–అనిరుధ్, రూరల్ మండల తహసీల్దార్

'దేశాయి' దోపిడీని ఐక్యంగా ప్రతిఘటిద్దాం



మాట్లాడుతున్న తాహెర్ బిన్ హందాన్

ఆర్మూర్‌టౌన్: దేశాయి బీడీ కంపెనీ యాజమాన్యం కార్మికులపై చేస్తున్న ఆర్థిక దోపిడీని ఐక్యంగా ప్రతిఘటిద్దామని ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, బీడీ కార్మిక ఫెడరేషన్ అధ్యక్షుడు పోశెట్టి పిలుపునిచ్చారు. ఆర్మూర్‌లోని కుమార్ నారాయణ భవన్‌లో ఆదివారం తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బీడీ కార్మికుల నుంచి ప్రతి వెయ్యి బీడీలకు దేశాయి యాజమాన్యం రూ.10 వసూలు చేస్తూ కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడుతోందన్నారు. కార్మికుల చేత తినుబండారాలు బలవంతంగా కొనుగోళ్లు చేయించడం సరికాదన్నారు. టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ముత్తెన్న, ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రభాకర్, జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్ రావు, రామకృష్ణ, దేవారం, నూర్జహాన్, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



వడ్డెర కాలనీ సమీపంలో..

సిరికొండ: మండలంలో అధ్వానంగా మారిన రోడ్లకు రోడ్లు భవనాల శాఖ అధికారులు మరమ్మతులు చేశారు. ఈ నెల 9న 'అధ్వానంగా గ్రామీణ రోడ్లు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆర్అండ్‌బీ శాఖ అధికారులు గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నారు. గుంతల్లో కంకర వేసి తారు వేస్తున్నారు. గుంతల రోడ్లకు మరమ్మతులు చేపడుతుండటంపై వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సర్పల్లి తండా వద్ద మరమ్మతులు చేసిన రోడ్డు

ప్రయాణం.. దూరం

- వరద తాకిడికి బీరప్పతండా వద్ద తెగిపోయిన హై లెవెల్ వంతెన
- 15 కిలోమీటర్లకు గాను 30 కిలోమీటర్ల తిరిగి వెళ్లాల్సిన దుస్థితి
- ఇబ్బంది పడుతున్న కొట్టాలపల్లి గ్రామస్తులు
- తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టాలని వినతి



బీరప్ప తండా వద్ద వరద తాకిడికి తెగిపోయిన హై లెవెల్ వంతెన (ఫైల్)

ధర్పల్లి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ధర్పల్లి మండలం హోన్నాజీపేట్ అటవీ ప్రాంతంలోని ముత్యాల చెరువు తెగిపోవడంతో వరద తాకిడికి బీరప్ప తండా వద్ద ఉన్న హై లెవెల్ వంతెన తెగిపోయింది. దీంతో కొట్టాలపల్లి గ్రామానికి ధర్పల్లికి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ధర్పల్లి మండలంలోని శివారు గ్రామమైన కొట్టాలపల్లి గ్రామం దట్టమైన అడవి ప్రాంతంలో ఉంటుంది. కొట్టాలపల్లి గ్రామ ప్రజలు ఇదే వంతెన మీదుగా బీరప్ప తండా, హోన్నాజీపేట్ మీదుగా ధర్పల్లి మండల కేంద్రానికి రావడానికి 15 కిలోమీటర్లలో ఇదే ప్రధాన మార్గం. ప్రస్తుతం అత్యవసర పరిస్థితుల్లో కొట్టాలపల్లి గ్రామ ప్రజలు ఇందల్వాయి మండలం డొన్కల్, జీకే తండా, గౌరారం, లింగాపూర్, ఎల్లారెడ్డి చౌరస్తా, అన్సాన్‌పల్లి, మద్దుల్ చౌరస్తా మీదుగా 30 కిలోమీటర్ల దూరం తిరిగి ధర్పల్లికి వస్తున్నారు. కొట్టాలపలి గ్రామంలో బ్యాంకు లేకపోవడంతో హోన్నాజీపేట్ గ్రామంలో ఉన్న బ్యాంకులో వారు లావాదేవీలు జరుపుతారు. నిత్యం బ్యాంకు పనులతో పాటు ధర్పల్లి మండల కేంద్రంలో ఉన్న తహసీల్, మండల పరిషత్ కార్యాలయం, ఐకేపీ ఎస్ఆర్ఈజీఎస్, మండల ఆరోగ్య కేంద్రం, పోలీస్ స్టేషనులకు వివిధ పనుల నిమిత్తం ధర్పల్లికి చేరుకోవాలంటే అదనంగా 30 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుందని కొట్టాలపల్లి గ్రామస్తులు వాపోతున్నారు. అలాగే ధర్పల్లికి చెందిన ప్రజలు హోన్నాజీపేట్, కొట్టాలపల్లి మీదుగా కామారెడ్డి, హైదరాబాద్‌కి ఇదే మార్గం గుండా ప్రయాణం చేస్తారు.ప్రస్తుతం వరి కోతలు ప్రారంభమై కావడంతో కొటాలపల్లి గ్రామంలో హోన్నాజీపేట్ సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. అక్కడ కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించడానికి తెగిపోయిన వంతెన మీదుగానే రాకపోకలు సాగేవి. ఇప్పుడు వంతెన తెగిపోవడంతో కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించడానికి లారీలు పోయే పరిస్థితి లేదు. హోన్నాజీపేట్ , బీరప్ప తండాలకు చెందిన రైతుల వ్యవసాయ పొలాలు వంతెనను దాటి అటువైపు వెళ్లాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి తెగిపోయిన వంతెన వద్ద తాత్కాలికంగా వాహనాలు పోవడానికి అయినా మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది



గ్రామస్తులం ధర్పల్లి మండల కేంద్రానికి చేరుకోవడానికి అదనంగా తిరిగి ప్రయాణం చేయాల్సి వస్తుంది. దీంతో మాకు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. అధికారులు స్పందించి కొట్టుకపోయిన వంతెన వద్ద తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి ఇబ్బంది లేకుండా చూడాలి.

– భూక్య పాండు, కొట్టాలపల్లి గ్రామం

ఇబ్బందులు పడుతున్నాం



బీరప్ప తండా వద్ద హై లెవెల్ వంతెన తెగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అటువైపు వ్యవసాయ పొలాలు కోతకు వచ్చాయి. హార్వెస్టర్లు, ట్రాక్టర్లు వాగులో నుంచి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రైతుల కష్టాలు తొలగించాలి.

– లావుడ్యా శ్రీనివాస్, బీరప్ప తండా

మట్టి ప్రమిదలతో దీపావళి శుభాకాంక్షలు



మోపాల్ : దీపావళి పండుగ సందర్భంగా మోపాల్ గ్రామంలో యోగా కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులు సరస్వతీ దేవికి పూజలు చేశారు. పర్యావరణకు ఆటంకం కలగకుండా 101 మట్టి ప్రమిదలతో ఆదివారం దీపావళి అని రాసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చిన్నారులు, యోగా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.